తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
27 జూన్ 2026
Follow :





## ప్రారంభం రోజే పరికరానికి పగులు


### ఇందిరాపార్క్ ఓపెన్ జిమ్‌లో నాణ్యతా లోపాలు

**ముషీరాబాద్, జూన్ 26 (జనంసాక్షి) :** ముషీరాబాద్‌లోని కావడిగూడ ఇందిరా పార్క్‌లో శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఓపెన్ జిమ్‌లో నాణ్యతా లోపాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవం జరిగిన కొద్ది సేపటికే ఓ జిమ్ పరికరం ఇనుప పైపు జాయింట్ వద్ద పగులు కనిపించడంతో నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తాయి. స్థానికుల కథనం ప్రకారం, వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన ప్రధాన పరికరాల్లో ఒకటి వెల్డింగ్ చేసిన భాగం వద్ద నిలువుగా చీలిక ఏర్పడింది. దీంతో నాసిరకం మెటీరియల్ వాడారా? లేదా పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టలేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభోత్సవం కోసం పూలమాలలతో అలంకరించిన జిమ్ పరికరాలు వాస్తవానికి భద్రతా ప్రమాణాలను పాటించలేదని మార్నింగ్ వాకర్స్ ఆరోపిస్తున్నారు. ఎవరైనా వ్యాయామం చేస్తున్న సమయంలో పరికరం పూర్తిగా విరిగిపోతే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి, పగులు వచ్చిన పరికరంతో పాటు మిగతా అన్ని జిమ్ పరికరాల నాణ్యతను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బాధ్యతను నిర్ధారించి, నాణ్యతా లోపాలు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ముదురుతున్న సికందర్‌గూడ భూ వివాదం

### ఇరు వర్గాల పరస్పర ఆరోపణలు





**రాజేంద్రనగర్,జూన్26(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ జాగీర్ పరిధిలోని సికందర్‌గూడ భూ వివాదం ఇరు వర్గాల వాదనలు రోజు రోజుకు తీవ్ర రూపం దాలుస్తుంది. సికిదర్ గూడ సర్వే నెం 1/పి ప్లాట్ నంబర్లు 40, 41 యాజమాన్యంపై ఇరువర్గాలు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ శుక్రవారం వివాదాస్పద స్థలం వద్ద మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా బిల్డర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సర్వే నంబర్ 1/నీలోని స్థలానికి సంబంధించిన అసలు మదర్ డాక్యుమెంట్లు లేకుండానే విక్రయాలు జరిగాయని ఆరోపించారు. తాను ఈ స్థలంలోని రెండు ఎకరాల పరిధిలోని 2005లో సుష్మారెడ్డి నుంచి ప్లాట్లు 39, 40, 41, 42 కొనుగోలు చేశానని, వార్డు సభ్యుడు నాగుల నరేందర్ చెబుతున్నట్లుగా జి. ప్రకాష్ గౌడ్ వద్ద అసలు డాక్యుమెంట్లు ఉంటే వాటిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు వార్డు సభ్యుడు నాగుల నరేందర్ మాట్లాడుతూ, 2003లో మహమ్మద్ ఇక్బాల్ అలీ, మహమ్మద్ అక్బర్ అలీ లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా జి. ప్రకాష్ గౌడ్ కుటుంబ సభ్యుల నుంచి 400 గజాల ప్లాట్లు కొనుగోలు చేశానని, అనంతరం 2026 ఫిబ్రవరి 27న అదే జి. ప్రకాష్ గౌడ్ కుటుంబ సభ్యుల నుంచి అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. సర్వే ప్రకారం నాలుగు ఎకరాల పరిధిలో ఉన్న తన ప్లాట్లు 40, 41పై ఎలాంటి స్టేటస్ కో లేదని, వివాద స్థలంలో నకిలీ డాక్యుమెంట్లుగా సృష్టించడంలో సందేహం లేదన్నారు. అలాగే, ఎల్.బి.నగర్‌లోని రంగారెడ్డి జిల్లా 14వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి O.S. No.237/2006లో జారీ చేసిన మూడవ పక్ష హక్కులు సృష్టించకుండా నిరోధించే తాత్కాలిక ఉత్తర్వులను హైకోర్టు సమర్థించిందని చెప్పారు. హైకోర్టు తుది తీర్పు తనకు అనుకూలంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, న్యాయస్థాన తీర్పు వచ్చే వరకు వేచి చూడాలని అన్నారు.

## మత్తుకు దూరంగా ఉండండి.. బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి

### అవగాహన కార్యక్రమంలో డిసిపి శిరీష




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ వసతి గృహ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్ నగర్ జోన్ డీసీపీ శిరీష,ఏసీపీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సలహాలు సూచనలతో అవగాహన కల్పించారు ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో గౌరవం గుర్తింపు ఉన్నత స్థాయిగా ఎదగడానికి విద్య ఒక్కటే శక్తివంతమైన ఆయుధమని అన్నారు విద్యార్థులు చిన్న వయస్సులోనే మంచి లక్ష్యలను ఏర్పరచుకుని, క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు అదేవిధంగా, యువత జీవితాలను నాశనం చేస్తున్న ప్రధాన సమస్యల్లో మాదక ద్రవ్యాల వినియోగం ఒకటని, మత్తు పదార్థాల ప్రభావానికి లోనైతే ఆరోగ్యం, విద్య, కుటుంబ సంబంధాలు భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని తెలియజేశారు స్నేహితుల ఒత్తిడి, తప్పుడు ఆకర్షణలు లేదా ఆసక్తి పేరుతో మాదక ద్రవ్యాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ చుట్టూ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు యువతే దేశ భవిష్యత్తు అని ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి, ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలి

### వెంకటేశ్వర్ రెడ్డి




**ముషీరాబాద్, జూన్ 26 (జనం సాక్షి):** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ బ్యాంకుల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమెరకు శుక్రవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఏపీ టీఆర్ఆర్‌బీఈ అధ్యక్షుడు బి. రవికాంత్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల పదోన్నతులను స్పాన్సర్ బ్యాంకుల్లో అమలవుతున్న విధానంలోనే అమలు చేయాలని కోరారు. అలాగే దేశంలోని 28 రాష్ట్రాల్లో ఉన్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. వేణు రావు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల బాపు, కోశాధికారిగా టి. సతీష్ ఎన్నికయ్యారు. సమావేశంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాప్ రెడ్డి పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సి. రాజీవన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ (హెచ్ఆర్, ఐటీ, బోర్డు) ఎస్. శంకరరావు, ఎన్ఎఫ్ఆర్ఆర్‌బీఈ అధ్యక్షుడు అశ్వత్, ఉపాధ్యక్షుడు శివకుమార్ బేగ్లూర్, ప్రధాన కార్యదర్శి సమీరన్ మెధి తదితరులు పాల్గొన్నారు.



# కొడంగల్‌లో ఘనంగా సాహు మహారాజ్ 152వ జయంతి

**కొడంగల్, జూన్ 26(జనంసాక్షి) :** కొడంగల్ టౌన్ బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో చత్రపతి సాహు మహారాజ్ గారి 152వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.పట్టణ బీఎస్పీ పార్టీ అధ్యక్షులు కే. దస్తప్ప అధ్యక్షత కొడంగల్ బీఎస్పీ పార్టీ ఇంచార్జ్‌లు యు. రమేష్ బాబు, కాశీనాథ్, కొడంగల్ తాలూకా బీఎస్పీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా బీఎస్పీ ఉపాధ్యక్షులు ఇశ్వప్ప తదితరులు పాల్గొన్నారు. కళాకారుడు బాలు పాటలు, మాటలతో అలరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చత్రపతి సాహు మహారాజ్ బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చిన పితామహుడని, వారు చదువుకోవాలని వసతిగృహాలు, బడులు కట్టించిన మహా మేధావి అని కొనియాడారు. స్త్రీలకు బాల్య వివాహాలు చేయరాదని చట్టాలు తీసుకొచ్చిన సంస్కర్త అని, కుల నిర్మూలన కోసం పోరాడిన వీరుడని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు పై చదువుల కోసం లండన్ వెళ్లేందుకు స్కాలర్‌షిప్ మంజూరు చేసిన మహనీయుడు సాహు మహారాజ్ అని ఆయన చారిత్రక నిర్ణయాలను గుర్తు చేశారు.కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల మహిళలు, పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మొహరం వేడుకలు



**అంబర్పేట జూన్ 25 (జనం సాక్షి) :** మానవత్వం న్యాయం ధర్మం కోసం తన ప్రాణాలు అర్పించిన మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకొని శుక్రవారం అంబర్పేట మండలం వ్యాప్తంగా మొహరం వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, ఈ మేరకు ఏర్పాటుచేసిన హసన్, హుస్సేన్, బీబీ ఫాతిమా, ఇమామ్ ఖాసిం, తదితర పీర్లను దత్తీలతో అందంగా అలకరించి నగర వీధుల గుండా డప్పు చప్పులతో తీసుకెళ్లారు, మొహరం పండుగ సందర్భంగా నగరం అంతట ఆధ్యాత్మిక వాతావరణము కు నెలకొంది, మొహరం వేడుకల్లో కుల మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని సామరస్యానికి ప్రతీకగా నిలిచారు, భక్తులకు తాగునీరు షర్బత్ పంపిణీ చేశారు, చాలాచోట్ల మహిళలు పేర్లకు హారతులతో ఘన స్వాగతం పలికారు, వేడుకలు ప్రశాంతంగా విజయవంతంగా జరిగేలా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం

### అర్ధరాత్రి 3 వరకు బోరు తవ్వించిన కౌన్సిలర్

**తాండూరు జూన్ 26(జనంసాక్షి)**మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులోని శివాజీ చౌక్ సమీపంలోని అప్నా బజార్ కాంప్లెక్స్ వద్ద తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో కౌన్సిలర్ వైశాలి రాజు గౌడ్ వెంటనే స్పందించారు. సమస్యను మున్సిపల్ అధికారుల



దృష్టికి తీసుకెళ్లిన ఆమె, నూతన బోరు బావి తవ్వకం పనులను స్వయంగా పర్యవేక్షించారు. అర్ధరాత్రి 3 గంటల వరకు అక్కడే ఉండి బోరు పనులు పూర్తి చేయించారు. వార్డు సమస్యపై తక్షణమే స్పందించి సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులకు కౌన్సిలర్ వైశాలి రాజు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల నాటి తాగునీటి కష్టాలను తీర్చిన కౌన్సిలర్‌కు స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. చొరవ చూపి సమస్య పరిష్కరించినందుకు కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ పాలకులకు ధన్యవాదాలు తెలిపారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిత సాధ్యం

### ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి
### మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసులు సమన్వయంతో చర్యలు ఏసీపీ కిషన్

**చేవెళ్ల (జనంసాక్షి)** క్షణికానందం కోసం మాదకద్రవ్యాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోకుండా యువత అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాల జనరల్ ఆస్పత్రిలో ఫ్యూచర్ సిటీ పోలీసులు, ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు చేపడుతోందని, త్వరలో ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి విస్తృత అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఏసీపీ కిషన్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం నేరప్రవృత్తిని పెంచడంతో పాటు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, మాదకద్రవ్యాల వినియోగదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ బారినపడిన వారిలో మార్పు తీసుకురావడంలో వైద్యులు, వైద్య విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు



అలవాట్లకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తేజశ్రీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోయా రాణి, సీఈఓ అజ్మల్ హస్సన్, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, రఘువీరారెడ్డి, వినోద్ రెడ్డి, మల్లారెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తేజశ్రీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జోయా రాణీ, సీనియర్ సిబ్బంది సీఈఓ అజ్మల్ హస్సన్, నాయకులు మాణిక్ రెడ్డి, రఘువీరా రెడ్డి, వినోద్ రెడ్డి, మల్లా రెడ్డి,అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో సమన్వయంతో పని చెయ్యండి

### సర్ తాండూరు నియోజకవర్గం కన్వీనర్ కరణం పురుషోత్తం రావు

**తాండూరు జూన్ 26(జనంసాక్షి) :** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాలతో,ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పక్రియ లో భాగంగా గౌతాపూర్, చెంగోల్ , జింగుర్తి, మల్కాపూర్ గ్రామాలలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జాదవ్ ధారసింగ్ నాయక్ మండల ముఖ్య నాయకులు బిఎల్ఓ లు,బిఎల్ ఎ లతో కలసి ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రతి ఒక్కరి ఓటును కాపాడాలని ఎటువంటి సమస్యలు ఉన్న సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ రవి గౌడ్,ఎయంసి చైర్మన్లు పట్లోళ్ళ నర్సింలు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సి రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరీశ్వర్ రెడ్డి మాజీ ఎయంసి చైర్మన్ వడ్డే శ్రీనివాస్ మండల పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్ మాజీ అధ్యక్షులు నాగప్ప, సర్పంచ్ సృజన, సీనియర్ నాయకులు మల్కాపూర్ జనార్ధన్ రెడ్డి, రాజు పటేల్, రాము చెంగోల్, బోయిని నర్సింలు, అజ్మత్ అలీ, రషీద్, కోతి గోపాల్, గోపాల్ రెడ్డి, బందెప్ప, మౌలానా, శ్రీనివాస్, మల్లేష్, రఘునాథ్ రెడ్డి, పండరి, జగదీష్ గౌడ్, అజమ్ పాషా, శాంతప్ప, తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగవైభవంగా ప్రారంభమైన శ్రీనిమిషాంబదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు

### అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్లోని ప్రసిద్ధిచెందిన శ్రీమాతాదనిమిషాంబదేవి ఆలయ ద్విదశాబ్ది వార్షికబ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగవైభవంగా ప్రారంభమైయ్యాయి. 28 వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు జంటనగరాలతో పాటు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు శ్రీనిమిషాంబదేవి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి. ఆదిపరాశక్తి, భక్తుల పాలిట కల్పవల్లి, నిమిషములో కోరిన కోర్కెలను తీర్చే కరుణామయి, మొక్కితే కరుణించి - కోరితే వరములు ప్రసాదించే అమ్మలగన్న అమ్మ శ్రీ మాతా నిమిషాంబదేవి వార్షికబ్రహ్మోత్సవాలలో భాగంగా తొలి రోజు శుక్రవారం సాక్షాత్తు శ్రీమహాలక్ష్మీదేవి విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దివ్య దర్శన భాగ్యా ప్రసాదించారు.



సువర్ణ కాంతులతో విరాజిల్లుతూ, లక్ష్మీకళలతో దేదీప్యమానంగా, అపూర్వమైన ఆభరణ భూషణాలతో అలంకృతురాలై, దివ్యతేజోమయ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారి మహిమాన్విత స్వరూపం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. అమ్మవారి సన్నిధిలో వెలసిన ఆ దివ్యకాంతులు,మంగళ వాద్యాలనాదాలు. భక్తుల నిమిషాంబ నామస్మరణల మధ్య ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మికశోభతో పరవశించింది. అమ్మవారి ఈ మహాలక్ష్మీ స్వరూప దర్శనం సకల ఐశ్వర్యాలు. సౌభాగ్యాలు, ఆరోగ్యం, ఆనందం శాంతిని ప్రసాదించినట్లయింది. వందలా మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఆలయ ట్రస్ట్ కమిటి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజు శుక్రవారం వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమాతా నిమిషాంబదేవి ట్రస్ట్ చైర్మన్ కామరౌతు వినోద్కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదలు కె. అశోకక్కుమార్. సంగు శ్రీనివాస్. కోశాధికారి ఎన్. రమేష్. రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాసరావు ట్రస్ట్ ధర్మకర్తలు బి. హేమచందర్. వై.చంద్రశేఖర్. ఎస్.గౌరిశంకర్, డి.నర్సింగ్రావు. ఎమ్.శ్రీనివాసవు.ఎమ్.సాయి బాబా (శ్యామ్), డి.సతీష్,రామగిరి శ్రీకాంత్.ఎన్. శ్రీకాంత్, “.రామకృష్ణ ఎన్.మోహన్.డి.రామక్రిష్ణ ఎన్.శ్రీధర్, వెంకట్ రాజారావు. కె.ప్రవీణ్ కుమార్. డి.నరేష్. వై.సత్యనారాయణ ఆలయ ప్రధాన అర్చకులు చంద్ర ఖర్ శర్మ. అర్చకుడు ఉమకాంత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# బేగరి రాజుకు ఘనంగా సన్మానం



**మొయినాబాద్, జూన్ 26 (జనంసాక్షి):** సురంగల్ 14 వార్డు చెందిన బేగరి రాజు కు ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ఎస్సీ, ఎస్టీ అట్రాక్సిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా నెంబర్ గా నియమించడం జరిగింది. సందర్భంగా శుక్రవారం నాడు సురంగల్ గ్రామ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యువ నాయకులు అందరూ కలిసి బేగరి రాజు ను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనము నుండి ఎన్నో కష్టాలను అధిరోహించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం వారి సమస్యల పరిష్కారం కోసం గత 20 సంవత్సరాల నుండి సామాజిక ఉద్యమ నాయకుడు దళిత రత్న అవార్డు గ్రహీత బడుగు బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని చురుకైన పాత్ర పోషించడం జరిగిందని వారు అన్నారు మా ఊరికి లాంటి గుర్తింపు తేవడం ఎంతో గౌరవంగా ఉందని సురంగల్ గ్రామ ప్రజలు గర్వించదగ్గ విషయం అన్ని మీడియతో తెలిపారు ఈ కార్యక్రమంలో కందికొండ మహేష్ గౌడ్, చేగురి విజయ్ గౌడ్, మాల సునీల్, కుమ్మరి శ్రీనివాస్, ఉప్పరి సందీప్, సోమ నరేష్, పాశం ప్రవీణ్

# మదనపల్లి వద్ద బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



**శంషాబాద్, జూన్26 (జనంసాక్షి):** శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామ పరిధిలోని ఎన్‌హెచ్-44పై శనేశ్వరం ఆలయం సమీపంలో శు క్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన అమానుల్లా ఖాన్ (24) తన స్నేహితుడు మొహమ్మద్ తయోసిఫ్ నడుపుతున్న ద్విచక్ర వాహనంపై జేపీ దర్గా, కొత్తూర్ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అతివేగం, నిర్లక్ష్యంగా బైక్ నడపడంతో రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న అమానుల్లా ఖాన్ రోడ్డుపై పడిపోయి ఛాతికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న తయోసిఫ్‌కు కాలికి గాయాలయ్యాయి.మృతుడి తండ్రి హమీద్ ఖాన్ ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అభివృద్ధిపై ప్రతిపక్షాల విమర్శలు మానుకోవాలి

**- సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**



**శంషాబాద్, జూన్26 (జనంసాక్షి):** రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నర్ఖూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం నర్ఖూడ గ్రామంలో రోడ్డు నిర్మాణం ఆలస్యంపై ప్రతిపక్షాలు చేపట్టిన రాస్తారోకోను ఖండిస్తూ మీడియాతో మాట్లాడారు. పానాది వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం సాంకేతిక కారణాలతో రోడ్డు పనులు ఆలస్యమయ్యాయని, మరో పది రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. రోడ్డు సమస్యపై ప్రతిపక్ష నేతలు ఎన్నడైనా ఎమ్మెల్యే, మంత్రులు లేదా అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 2 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, నర్ఖూడలో 125 ఇళ్లకు ఆమోదం లభించగా 45 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు నీరటి మహేష్ ముదిరాజ్, ప్రేమ్ కుమార్, తొంట అశోక్, హిరేకార్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకుడు



**ఘట్కేసర్, జూన్ 26 (జనంసాక్షి):** అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. సి. మల్లేశ తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) నిర్వహించిన 7వ వార్షిక సదస్సులో ప్రథమ ఉత్తమ పరిశోధనా పత్రం పురస్కారాన్ని అందుకొని విశ్వవిద్యాలయానికి గౌరవం తీసుకొచ్చారు. "వికసిత్ భారత్--2047: కృత్రిమ మేధస్సు యుగంలో వాణిజ్యం, నిర్వహణలో కొత్త కోణాలు" అనే ప్రధాన అంశంపై జూన్ 25న వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డా. మల్లేశ తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. గ్రామీణ భారతదేశంలో ఆర్థిక సమగ్రత సాధనలో కృత్రిమ మేధస్సు పాత్రను విశ్లేషిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత ఆర్థిక సేవల అందుబాటును అంచనా వేయడానికి గ్రామీణ కృత్రిమ మేధస్సు ఆర్థిక సమగ్రత సూచిక (రైఫీ) అనే వినూత్న నమూనాను ఆయన రూపొందించారు.

వివిధ విద్యాసంస్థల నుంచి సమర్పించిన పరిశోధనా పత్రాల్లో ఉత్తమమైన ఐదు పత్రాలను ఎంపిక చేయగా, డా. మల్లేశ సమర్పించిన పరిశోధనా పత్రం ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా రూ.5 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రంతో పాటు ప్రథమ ఉత్తమ పరిశోధనా పత్రం పురస్కారాన్ని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డి. చెన్నప్ప అందజేశారు. ఈ విజయంపై అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పరిశోధనా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజల కంటి వెలుగు కోసం ఉచిత వైద్య శిబిరాలు అవసరం

**- మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా**



**జవహర్ నగర్, జూన్ 26:(జనంసాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ పాపయ్యనగర్‌లో విస్ విజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, ఎస్ ఎస్ ఫౌండేషన్ సహకారంతో, బాల వికాస సేవా సంస్థ భాగస్వామ్యంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కంటి చూపు మనిషికి అమూల్యమైన వరం. చిన్నచిన్న నిర్లక్ష్యాల వల్ల పెద్ద సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సమాజ సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న విస్ విజన్ హాస్పిటల్స్, ఎస్, ఎస్ ఫౌండేషన్, బాల వికాస సేవా సంస్థలను అభినందిస్తున్నాను. భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరుతున్నాను" అని అన్నారు. శిబిరంలో సుమారు 100 మంది ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి అవసరమైన సలహాలు, సూచనలు పొందారు. అవసరమైన వారికి తదుపరి చికిత్స కోసం వైద్యులు మార్గనిర్దేశం చేశారు. బాలవికాస సేవా సంస్థ తరఫున కోఆర్డినేటర్లు ఇన్నా రెడ్డి, వినోద్ రెడ్డి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి స్థానిక కాలనీవాసులు భారతి, బాలుతో పాటు పలువురు విశేష సహకారం అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, సేవా సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తులసి రమణాచార్యులకు ఘన సన్మానం



**మల్కాజిగిరి, జూన్ 26(జనంసాక్షి):** తెలంగాణ సాహిత్య అకాడమీ, 'యూ అండ్ మీ' సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కవిసమ్మేళనంలో మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, అర్చకులు డా. తులసి వెంకట రమణాచార్యులు ఘన సన్మానం అందుకున్నారు.

తెలుగు సాహిత్యంలో వినూత్న ప్రయోగంగా మనోవైజ్ఞానిక అంశాలతో మనశ్శాంతి – జీవన క్రాంతి అనే అంశంపై ఆయన చేసిన కవితా పఠనం సాహితీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి, అకాడమీ కార్యదర్శి డా.నమోజు బాలచారి, ప్రముఖ సైకాలజిస్ట్ డా. సి.వీరేందర్ చేతుల మీదుగా రమణాచార్యులను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో తొందరపాటు వద్దు

**- బీఆర్ఎస్ సీనియర్ నేత సంతోష్ గౌడ్**



**తాండూరు, జూన్ 26 (జనంసాక్షి):** డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంతోష్ గౌడ్ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తికాలేదని, ఈ దశలో హడావుడిగా కేటాయింపులు చేస్తే నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని సంతోష్ గౌడ్ అభిప్రాయపడ్డారు. గతంలో కలెక్టర్ వార్డుల వారీగా క్షేత్రస్థాయి విచారణ జరిపి, అర్హుల జాబితా సిద్ధంచేసిన తర్వాతే ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. అయితే చాలా వార్డుల్లో ఇప్పటికీ సమగ్ర విచారణ జరగలేదని తెలిపారు. ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారు కూడా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను మాత్రమే అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని సంతోష్ గౌడ్ కోరారు. ప్రతి వార్డులో పారదర్శకంగా విచారణ జరిపి అర్హుల తుది జాబితా సిద్ధం చేయాలని, తర్వాత మాత్రమే పూర్తి పారదర్శకతతో పేద కుటుంబాలకు ఇళ్లను పంపిణీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే శంకరయ్య సమక్షంలో
# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బిఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ నర్సింలు

**జిల్లెడు చౌదరి గూడ (జనంసాక్షి):** మండలంలో ఒక్కొక్కరు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు శుక్రవారం నాడు ఎమ్మెల్యే శంకరయ్య సమక్షంలో బిఆర్ఎస్ నాయకులు కొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు జిల్లేడు చౌదరిగూడ మండల పరిధి చేగిరెడ్డి ఘనపూర్ గ్రామం ఉపసర్పంచ్ గా గత లోకల్ బాడీ ఎన్నికలో ఆ గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిపించారు.నేడు తను కాంగ్రెస్ పార్టీలోకి పోవడం జరిగింది.

ఉప సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ చేసింది ఏమీ లేదని ఉట్టి మాటలు చెప్పుకుంటూ కాలం వెలదీసారని పేర్కొన్నారు లక్ష్మి దేవి పల్లి రిజర్వాయర్ పనులు బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మొదలు పెట్టకుండా కాలయాపన చేసిందని పేర్కొన్నారు నేడు కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం వచ్చాక లక్ష్మీదేవి రిజర్వేర్ పనులు చక్క చక్క సాగిపోతున్నాయని పేర్కొన్నారు ప్రజాపాలన ప్రభుత్వం అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీలోకి పోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పూరషోత్తం రెడ్డి, సర్పంచ్ లు శివమౌళి, రాంచంద్రయ్య సత్యనారాయణ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.





## టయోటా షోరూంలో
# అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారును ఆవిష్కరించిన మధుయాష్కి గౌడ్

**హయత్‌నగర్, జూన్ 26 (జనంసాక్షి):** చింతల్‌కుంటలోని టయోటా షోరూంలో నూతనంగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారును టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ఫీచర్లు, నాణ్యమైన సేవలు అందించినప్పుడే ఆటోమొబైల్ సంస్థలు ప్రజాదరణ పొందగలవని పేర్కొన్నారు. అనంతరం షోరూం నిర్వాహకులు నూతన అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారులోని ఆధునిక సాంకేతిక ఫీచర్లు, భద్రతా ప్రమాణాలు, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు.



ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కొత్తకురుమ శివకుమార్, డివిజన్ అధ్యక్షులు బుడ్డా సత్యనారాయణ, మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, బద్దుల వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, మేఘవత్ గణేష్ నాయక్, మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, సురేష్ యాదవ్, భీమిడి రామకృష్ణారెడ్డి, సామ మహేశ్వర్ రెడ్డి, గణేష్ రెడ్డి, కంచర్ల కవిత, న్యాయవాది గంగిరెడ్డి, వేములయ్య గౌడ్, బాలకృష్ణ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు, షోరూం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా
# 'నిరామయ తరంగ్' మాదకద్రవ్యాల నిరోధక విభాగం ప్రారంభం

**శంకర్‌పల్లి జూన్26 (జనంసాక్షి):** మండలంలోని దంతాన్ పల్లిలో గల ఐఎఫ్‌హెచ్‌ఈ లో "నిరామయ తరంగ్" పేరుతో మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఓరియంటేషన్ మరియు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంచి,వ్యసనరహిత క్యాంపస్ వాతావరణం కల్పించడమేలక్ష్యం అని ప్రారంభోత్సవంలో ఐఎఫ్‌హెచ్‌ఈ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కోటి రెడ్డి, మోకిలా సీఐ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఐబీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. వేణుగోపాల్ రావు, సంయుక్త రిజిస్ట్రార్ వి. మధుసూదన్ రావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల వ్యక్తులు, కుటుంబాలు ఎదుర్కొనే తీవ్ర పరిణామాలను వివరించారు. యువతే సానుకూల మార్పుకు మార్గదర్శకులుగా నిలిచి, వ్యసనరహిత సమాజ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో



నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులు వినీత గారిమెళ్ల, సిరిషా నూటి, యజ్ఞేశ్ కులకర్ణి, నమ్రత శర్మ సహా 16 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. ఆపరేషన్స్ కమిటీ సభ్యులుగా చందన్ గౌడ్, రాజేష్ నల్లమోతు, సత్యనారాయణ వ్యవహరించనున్నారు. సభ్యులంతా మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన దినోత్సవం సందర్భంగా ఐబీఎస్ ఎక్స్ప్రెషన్జ్ థియేటర్ సొసైటీ ప్రత్యేక నాటిక ప్రదర్శించింది. ఇన్ఫినిటీ స్టూడియోస్, సమావేశ్ క్లబ్‌లు సహకారం అందించగా, నజారియా క్లబ్ కార్యక్రమాన్ని డిజిటల్‌గా చిత్రీకరించింది.

"నిరామయ తరంగ్" విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తూ మాదకద్రవ్యాల రహిత భవిష్యత్తు కోసం పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ఓటరు జాబిత
# రూపకల్పనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
**- బిఎల్ఓ సూపర్వైజర్. దేవేందర్ రెడ్డి**




**ధారూర్ జూన్ 26(జనంసాక్షి):**
ఓటరు జాబిత రూపకల్పనలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని బిఎల్ఓ సూపర్వైజర్/ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బూత్ నెంబర్ లో స్వయంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఓ లు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లు నమోదు కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని. అదేవిధంగా నకిలీ ఓట్లను తొలగించాలని ప్రతి ఒక్కరూ బిఎల్వోల నుండి ఎన్యూమరేషన్ ఫారం తీసుకొని తమ వివరాలను రాసి ఇవ్వలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నమోదు చేసి ఓటు హక్కును పొందాలని అన్నారు.స్థానిక ఓటర్లు బిఎల్ఓ లకు సహకరిస్తూ ఎస్ఐఅర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓ సయ్యద్ సమీర్.బిఎల్ఏ బూత్ లెవెల్ అసిస్టెంట్/ఏజెంట్ రమేష్.ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**రాజేంద్రనగర్, జూన్26 (జనంసాక్షి):**
నార్సింగి ప్రధాన రహదారిపై టాటా మోటార్స్ ఎదురుగా, లంగర్ హౌజ్-నార్సింగి మార్గంలోని ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. డయల్100 ద్వారా సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సుమారు 32 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం దుస్తులు లేకుండా ఫుట్‌పాత్‌పై కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు, మృతుడు గత రెండు మూడు రోజులుగా ఆ ప్రాంతంలో తిరుగుతున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని గుర్తింపు కోసం ఉస్మానియా జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి
**- మండలం వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్**



**ధారూర్, జూన్26 (జనంసాక్షి):**
రైతులందరూ 2026-2027.రైతు భరోసా కు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. 15.06.2026 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు ఒక్కసారి కూడా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే వెంటనే రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.అర్హులు ఆయన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన తెలిపారు.కావలసిన డాక్యుమెంట్స్1.దరఖాస్తు.2. భూమి పాస్ బుక్ జిరాక్స్.3. ఆధార్ కార్డ్ జిరాక్స్.4. బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ (సేవింగ్ ఖాతా)చివరి తేదీ: 05.07.2026.ఇంతకు ముందు రైతు భరోసా వచ్చి ఉన్న రైతులు మళ్లీ దరఖాస్తు ఇవ్వాల్సిన అవసరం లేదు అని ఆయన తెలిపారు.

# ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**కొడంగల్, జూన్ 26 (జనంసాక్షి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను ప్రతి అర్హులైన ఓటరులు సద్వినియోగం చేసుకోవాలని రుద్రారం గ్రామ సర్పంచ్ ఎల్లప్ప కోరారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాల్సిన వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు, చిరునామా మార్పు, పేరు తొలగింపు వంటి అవసరాలున్న వారు ఎన్నికల అధికారులు కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

## మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్



**మర్పల్లి జూన్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం 2026 వానాకాలం సీజన్‌కు సంబంధించి మండలంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. 15 జూన్ 2026 తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులనీ , గతంలో లబ్ధి పొందిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం యథావిధిగా సాయం అందుతుందని పేర్కొన్నారు.అర్హులైన రైతులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు రైతు ఆధార్ కార్డు జిరాక్స్,పట్టాదారు పాస్ పుస్తకం మొదటి, చివరి పేజీల జిరాక్స్ ,బ్యాంకు ఖాతా పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ ,పూర్తిగా నింపిన దరఖాస్తు జతచేసి 05.07.2026 తేదీలోగా సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని సూచించారు.పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అర్హతలు, ఇతర సందేహాల నివృత్తి కోసం రైతులు తమ గ్రామ ఏఈఓను లేదా మర్పల్లి మండల వ్యవసాయ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని సూచించారు.

# బీఎల్‌ఏలు బాధ్యతయుతంగా పనిచేయాలి

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి



**మహేశ్వరం,జూన్26(జనంసాక్షి) :** బూత్ స్థాయి ఏజెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు.శుక్రవారం కందుకూరు మండలంలోని పలు గ్రామాలల్లో బీఎల్‌ఎల అవగాహన సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలన్నారు.ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దేలా బీఎల్‌ఎలు పని చేయాలన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ మల్లేష్,అందుగుల సత్యనారాయణ,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో తొందరపాటు నిర్ణయాలు మానుకోవాలి

## బీఆర్ఎస్ 31వ వార్డు కౌన్సిలర్ అవుసుల యోగానంద్

**తాండూరు జూన్ 26(జనంసాక్షి)** డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో తొందరపాటు నిర్ణయాలు వద్దని బీఆర్ఎస్ 31వ వార్డు కౌన్సిలర్ అవుసుల యోగానంద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్ అవుసుల యోగానంద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి  డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, పారదర్శకంగా అర్హుల ఎంపిక జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హడావుడిగా ఇళ్లను కేటాయించడం వల్ల నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో కలెక్టర్ వార్డుల వారీగా క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, అర్హుల జాబితాను సిద్ధం చేసిన తర్వాతే ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు చాలా వార్డుల్లో సమగ్ర క్షేత్రస్థాయి విచారణ జరగలేదన్నారు.ఇప్పటికే సొంత ఇల్లు ఉన్న కొందరు కూడా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసినట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కావున ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను మాత్రమే అర్హులుగా గుర్తించాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రతి వార్డులో పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్హుల తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు.

# మయూరి కాలనీ సమస్యలను పరిష్కరించండి

## ఉప్పలపాటి శ్రీకాంత్

**శేరిలింగంపల్లి, జూన్ 26 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి మయూరి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే కృషి చేయాలని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాలనీ ప్రతినిధులు, స్థానికులతో కలిసి మయూరి నగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మయూరి నగర్ కాలనీవాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై తనను సంప్రదించిన నేపథ్యంలో మయూరి నగర్ కాలనీలో పర్యటించడం జరిగిందన్నారు. మయూరి నగర్ కాలనీ సమస్యలను, వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని స్థానికంగా ఉన్న నాలా సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన వాటిని పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, పనులలో అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని ఉప్పలపాటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా మిగిలిపోయిన నాలాల విస్తరణ పనులు చేపట్టాలని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, కాలనీ పరిధిలో మౌలిక వసతులు కల్పననే ప్రధాన ధ్యేయంగా తన ముందుకు సాగుతానని, స్థానికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసాను



వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను విడతలవారీగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ఓవైపు అధికారులను, మరోవైపు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని సంప్రదిస్తూ అనుకున్న పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీ అధ్యక్షులు కె. రామరాజు, ఉపాధ్యక్షులు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కిషోర్, అసోసియేషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమణారెడ్డి, వేణు, విజయమోహన్, ప్రేమానందం, శ్రీధర్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి

**దోమ జూన్ 26 జనం సాక్షి :** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సళ్ళల మల్లేష్ కి చెందిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో దోమ మండల కేంద్రానికి చెందిన చాలామంది పేదవారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయ్యాయని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవారికి సొంత ఇల్లు ఉండాలని ఉద్దేశంతో పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ జకటి వెంకటయ్య, వార్డు మెంబర్లు చాకలి వెంకటేష్, బోయిని శోభారాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రాములు, దుద్యాల మల్లేష్, బోయిని యాదయ్య, బిచ్చప్ప, శివ, బొక్క శ్రీనివాస్, వార్ల రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీల అమలు ఎప్పుడు..?

## ఇది నైతికత లేని ప్రభుత్వం

## బొబ్బ నవతారెడ్డి

**శేరిలింగంపల్లి, జోన్ 26 (జనంసాక్షి) :** ఆరు గ్యారెంటీల అబద్దాలను ఎరగా వేసి అక్రమ మార్గంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పాలించే నైతిక హక్కు లేదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి సార్ కారు బేషరతుగా గద్దె దిగిపోవాలని మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు బొబ్బ నవతారెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం చందానగర్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 6 గ్యారెంటీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను మోసంచేస్తే ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా మహిళా సంక్షేమాన్ని ఉద్ధరిస్తున్నానంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రాష్ట్ర ముఖ్యమంత్రి నాసిరకం చీరలను మహిళలకిచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని రోడ్డుకీర్చాడని నవతారెడ్డి దుమ్మెత్తి పోశారు. కెసిఆర్ ప్రభుత్వం అందజేసిన బతుకమ్మ చీరలు ఎంత నాణ్యతగా ఉన్నాయో మహిళలను అడిగితే తెలుస్తుందని, నిన్న మొన్న అందజేసిన చీరలు ఎంత నాణ్యతగా ఉన్నాయో కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఎవరు వచ్చినా తాను వివరించి నిరూపిస్తానని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల అమలు సున్నా అని, కోటి మందిని కోటీశ్వరుల వాగ్దానం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని, అన్నిటికీ మిన్నా రాష్ట్రాన్ని దోచుకోవడమే మొదటి ద్యేయంగా రేవంత్ గ్యాంగ్ ముందుకు సాగడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. చందానగర్‌లో లో



ఇప్పటికే సిఎంసి మహిళా భవనం స్థలం కబ్జాపై పట్టించుకునేవారే లేరని, కనీసం నియోజకవర్గ ఎమ్మెల్యేకు సైతం ఈ విషయంలో సమాచారం ఉందో లేదో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.

అధికారంలోకి రాకముందు నెల రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు, అత్తకి 4 వేల రూపాయల పెన్షన్, కోడలికి 2 వేల 500 రూపాయల మహాలక్ష్మి స్కీం, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీ లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎక్కడ దాచి పెట్టారు రాష్ట్ర ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని ఆమె ఎద్దేవా చేశారు. చందానగర్ డివిజన్ కైలాష్ నగర్ కాలనీలో గత ప్రభుత్వం మహిళల సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా కేటాయించిన 4 వేల గజాల విలువైన సిఎంసి ప్రభుత్వ భూమిని నేడు విద్యుత్ శాఖ(కరెంట్ డిపార్ట్‌మెంట్) అక్రమంగా ఆక్రమించుకుందని బొబ్బానవత ఆరోపించారు. మహిళలకు దక్కాల్సిన ఆస్తిని కరెంట్ శాఖ కబ్జా చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు వారికి వంతపాడుతున్నాడని, మహిళలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని, మహిళ భవనాన్ని నిర్మిస్తానని ఎన్నికల ముందు తమరు ఇచ్చిన కోటి రూపాయల చెక్కు ఏమైందని? మహిళ సంఘాలను మోసంచేసిన విషయం నిజంకాదా అని నవతారెడ్డి దుయ్యబట్టారు.

మహిళలకు దక్కాల్సిన మహిళాభవనం స్థలాన్ని తక్షణమే మహిళల కోసం స్వాధీనపరచుకొని ఇవ్వకుంటే మహిళలతో కలిసి న్యాయ పోరాటం చేస్తానని ఆమె హెచ్చరించారు. డ్వాక్రా మహిళలతోపాటు అర్హులైన ప్రతీ నిరుపేద మహిళకు రేవంత్ సర్కారు నాణ్యమైన చీరలను పంపిణీ చేయాల్సిందేనని, పెళ్లి కానుకగా తులం బంగారం, మహాలక్ష్మి పెన్షన్లు మరియు విద్యార్థులకు స్కూటీలుసహా ఆర్ గ్యారంటీల హామీని నిలబెట్టుకోవాలని పునరుద్ఘాటించారు.